క్లుప్తంగా

నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐగా రాంబాబు



గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐగా చీమల రాంబాబు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన 2009 బ్యాచ్ ఎస్ఐగా విధుల్లో చేరారు. ఇంటలిజెన్స్ విభాగంలో పనిచేస్తూ మూడు నెలల కిందట సీఐగా పదోన్నతి పొందారు. గతంలో సీఐగా పనిచేసిన బి. శ్రీనివాసరావు రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.

వంగిపురంలో నూజివీడు సీడ్స్ క్షేత్ర ప్రదర్శన



వంగిపురం (ప్రత్తిపాడు): న్యూ అన్నపూర్ణ రకంతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని నూజివీడు సీడ్స్ రీజనల్ మేనేజర్ సీహెచ్. భాస్కరరావు తెలిపారు. మండలంలోని వంగిపురంలో రైతు పడాల వీరశేఖర్ సాగుచేసిన నూజివీడు సీడ్స్‌కు చెందిన ఎన్‌పి-7373 (న్యూ అన్నపూర్ణ) వరి పొలంలో బుధవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వంగిపురం, వల్లూరు, సొపాడు, చినలింగాయపాలెం గ్రామాలకు చెందిన మూడు వందల మంది రైతులతో కలసి కంపెనీ ప్రతినిధులు పొలాన్ని సందర్శించారు. ఎన్‌పి-7373 సూపర్‌ఫైన్ రకం తెగుళ్లు, చీడపీడలను తట్టుకుని, అధిక దిగుబడులు ఇస్తుందని తెలిపారు. రీజినల్ మేనేజర్ సీహెచ్. భాస్కరరావు మాట్లాడుతూ సన్న రకానికి మార్కెట్‌లో మంచి ధర ఉంటుందని చెప్పారు. ఎన్‌పి-7373రకం సాగు చేసిన రైతును కంపెనీ ప్రతినిధులు సత్కరించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధి వి. శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నరేంద్రబాబు (ఫైల్)

ప్రత్తిపాడు: కంపెనీ క్వార్టర్స్ నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం, పొట్లపాడుకు చెందిన జవ్వాది నరేంద్రబాబు రెండు సంవత్సరాలుగా ప్రత్తిపాడు మండలం నడింపాలెంలోని ఆది శివం యార్న్ టెక్స్‌టైల్స్ కంపెనీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అక్కడే కంపెనీ క్వార్టర్స్‌లో భార్యాపిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. దసరా సెలవుల నేపథ్యంలో గత నెల 15న భార్యాపిల్లలను అత్తింట్లో వదిలిపెట్టాడు. అప్పటి నుంచి కంపెనీ క్వార్టర్స్‌లో ఒక్కడే నివాసం ఉంటున్నాడు. అదే నెల 21వ తేదీ సాయంత్రం బయటికి వెళ్లి నేటి వరకు తిరిగిరాలేదు. నాటి నుండి ఇప్పటి వరకు వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో, బుధవారం తండ్రి సాంబశివరావు ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్ఐ రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు ప్రత్తిపాడు పోలీసులను సంప్రదించాలని ఆయన సూచించారు.

శాస్త్రీయ దృక్పథంపై దేశవ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు



గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫిబ్రవరి 28వ తేదీ వరకు దేశవ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాల్ని చేపడుతున్నట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో బుధవారం సైంటిఫిక్ టెంపర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ ఫర్ నెట్‌వర్క్, అనుబంధ సంస్థ, ప్రజా సైన్స్ ఉద్యమ సంస్థ జనవిజ్ఞానవేదిక, ఇతర రాష్ట్రాల్లోని 40 సైన్స్ సంస్థలను కలుపుకుని దేశవ్యాప్తంగా ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్తలు సీవీ రామన్, మేడమ్ క్యూరీ జయంతి సందర్భంగా ఈనెల ఏడో తేదీన ప్రారంభించి, ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం వరకు దేశ వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఇందులో భాగంగా గ్రామ, పట్టణాలతో పాటు పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో మూఢ నమ్మకాలతో పాటు, సూడో సైన్స్ నిరోధించేందుకు శాస్త్రీయ దృక్పథ ప్రచార కార్యక్రమాల్ని ముమ్మరంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. జేవీవీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎస్.వేణుగోపాలరావు మాట్లాడుతూ సైన్స్ ఫర్ డెమోక్రసీ, సైన్స్ ఫర్ సెక్యులరిజం పేరుతో ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బి. ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించేతత్వాన్ని, సృజనాత్మకశక్తిని పెంపొందింపచేయడమే సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఎం. కళాధర్, బి. ఆదిలక్ష్మి, ఎండీ షకీలాబేగం, జి. వెంకట్రావు, ఎస్.ఎం. సుభాని, సయ్యద్ గయాసుద్దౌలా పాల్గొన్నారు.

బస్టాండ్ లోపలకు వెళ్లే దారేది ?

- గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌ని వీడని నిర్లక్ష్యం
- సరైన దారి లేక లోపలకు రావాలంటే ప్రయాణికుల పాట్లు
- కొందరి స్వార్థంతో మూతబడిన ప్రధాన ద్వారం
- ఇరుకైన దారితో అవస్థలు
- పక్కనే మూత్రశాల.. ముక్కు మూసుకోవాల్సిందే..
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్టాండ్‌లోకి బస్సుల ముందు నుంచి వెళుతున్న ప్రయాణికులు



నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన ద్వారం



రాకపోకలు నిలిపి వేసేందుకు ప్రధాన ద్వారం వద్ద అడ్డుగా పెట్టిన రాళ్లు



అధ్వానంగా ఉన్న మూత్రశాల ప్రాంతం

పాత గుంటూరు: విజయవాడ బస్‌స్టేషన్‌లో చోటు చేసుకున్న ప్రమాదం ఆర్టీసీ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ప్రయాణికుల్ని మరింత భయాందోళనకు గురి చేసింది. అదుపుతప్పిన బస్సు ప్లాట్‌ఫాం పైకి దూసుకెళ్లి ముగ్గురి ప్రాణాలు బలి తీసుకున్న ఘటనతో ప్రయాణికులు ఆర్టీసీ బస్సులంటేనే హడలిపోతున్నారు. ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. జిల్లాకే ప్రధాన కేంద్రమైన గుంటూరులోని ఆర్టీసీ బస్ స్టేషన్ కూడా ప్రమాదాలకు చిరునామాగా మారుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా సమస్యలకు స్టాండ్‌గా మారింది. కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం ప్రధాన రహదారి మూతపడింది. దీంతో సరైన దారి లేక బస్సులకు ఎదురు వెళుతూ ప్రయాణికులు సాగిస్తున్న రాకపోకలు ఆందోళన కలిగిస్తున్నాయి.

ఇరుకైన దారి నుంచి రాకపోకలు

నిత్యం లక్ష మంది పైగా రాకపోకలు జరిగే బస్టాండ్‌లో ప్రమాదకరంగా మారిన ఇరుకైన దారినుంచి రావాలంటే ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. స్పీడుగా వస్తున్న ఆటోలు, ఇతర వాహనాలు, వేగంగా మలుపు తిరుగుతున్న ఆర్టీసీ బస్సులను దాటి లోపలకు రావాలంటే హడలెత్తిపోతున్నారు. ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఆ ద్వారం పక్కనే మూత్రశాల ఉండడంతో ప్రయాణికులు ముక్కు మూసుకొని నడక సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

మూతబడిన అతి పెద్ద ప్రధాన ద్వారం

ఉమ్మడి జిల్లాలోని 13 డిపోలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన ఆర్టీసీ బస్సులు బస్టాండ్‌లోకి వచ్చేందుకు అతిపెద్ద ప్రధాన ద్వారం ఉంది. బస్సులు తిరిగే దారితో సంబంధం లేకుండా ప్రయాణికుల సౌకర్యార్థం రాకపోకల కోసం మార్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే, కొందరి స్వార్థం కారణంగా గత కొన్నేళ్లుగా ప్రధాన ద్వారం మూతపడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న దారి నుంచే ప్రయాణికులు బస్టాండ్‌లోకి వస్తుండటంతో ప్రమాదావకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. దివ్యాంగులు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఆ ఇరుకైన ద్వారం నుంచి లోపలికి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. లోపలికి వచ్చేందుకు ప్రధాన మార్గం ఉన్నా దాన్ని వినియోగం తేవడంలో ఆర్టీసీ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. ఇప్పటికైనా సురక్షితమైన నడక మార్గాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే చాలా మేలు జరుగుతుంది. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టి ప్రమాదాల్ని నివారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సమస్యను పరిష్కరిస్తాం



గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు చేపడతాం. ప్రమాదాలను నివారించి సురక్షితంగా బస్టాండ్‌లోకి వచ్చేలా ఏర్పాట్లు చేస్తాం. మూత్రశాలను అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకుంటాం.

– రవికాంత్, జిల్లా ప్రజా రవాణా అధికారి, గుంటూరు

నేటి నుంచి సంక్షేమ పథకాలు- అభివృద్ధి వివరాల ప్రదర్శన

గ్రామ వార్డు సచివాలయాల్లో బోర్డుల ఏర్పాటు



కట్టెంపూడి గ్రామ సచివాలయంలో లబ్ధిదారుల జాబితా ప్రదర్శన బోర్డు

పొన్నూరు: ఎన్నికల మేనిఫెస్టోలో నవరత్నాల పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీల్ని వంద శాతం అమలు చేసిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల్ని అమలు చేసి ప్రజల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటునందించారు. పథకాల ద్వారా నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయడంతో సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ బహిరంగంగా చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వై.ఎస్. జగన్ ఎందుకు కావాలంటే.. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రజలకు చేకూర్చిన ప్రయోజనాల్ని వివరించేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో అభివృద్ధి అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు, లబ్ధి పొందిన వారి వివరాలతో ప్రదర్శన బోర్డులు ఏర్పాటు చేసే కార్యక్రమం ప్రభుత్వం చేపట్టింది. నేటి నుంచి పొన్నూరు పట్టణ, మండల పరిధిలోని గ్రామ వార్డు సచివాలయాల్లో పథకాల బోర్డులను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

పొన్నూరు పట్టణంలో..

9న సాంబశివనగర్ సచివాలయం, 10న జెండా చెట్టు సచివాలయం, 14న క్యాబిన్ పేట్, 15న నాగుల చెరువు, 16న జయభారత్‌రెడ్డి నగర్, 17న డీఆర్‌కే కాలనీ, 20న టీచర్స్ కాలనీ రెండో సచివాలయం, 21న ఇందిరా కాలనీ, 22న ఎస్సీ ఎస్టీ కాలనీ రెండో సచివాలయం, 23న ఎస్సీ ఎస్టీ కాలనీ ఒకటో సచివాలయంలో బోర్డుల్ని ఆవిష్కరించి సభలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ ప్రకటనలో తెలిపారు.

పొన్నూరు మండలంలో..

9న మాచవరం సచివాలయం, 10న ములుకుదురు, 14న నండూరు, 15న ఉప్పరపాలెం, 16న పెదపాలెం, 17న పచ్చలతాడిపర్రు, 20న ఆరెమండ, 21న దొప్పలపూడి, 22న మామిళ్లపల్లి, 23న బ్రాహ్మణ కోడూరు గ్రామాల్లోని సచివాలయాల్లో ప్రదర్శన బోర్డులను ఆవిష్కరించి సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

శలపాడులో 559 మందికి కళ్లజోళ్లు పంపిణీ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ



శలపాడులో మహిళలకు కళ్లజోడు అందజేస్తున్న అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: మండలంలోని శలపాడులో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్ల పంపిణీని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో అంధత్వ సమస్య నివారణకు బజరంగ్ ఫౌండేషన్ కృషి చేస్తోందని తెలిపారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్ర జ్యోతి పేరుతో వైద్య శిబిరాల్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉచిత నేత్ర వైద్య శిబిరాల అనంతరం వైద్యసేవల్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. జగనన్న సంక్షేమ పాలనను ఆదర్శంగా తీసుకుని కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయాలకు అతీతంగా ఈ సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. శలపాడులో 613 మంది నేత్ర పరీక్షలు చేయించుకోగా, సమస్య ఉన్న వారందరికీ వారం రోజుల్లోనే 559 మందికి కళ్లజోళ్లను అందించినట్లు చెప్పారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన నేత్రజ్యోతి శిబిరానికి అనూహ్య రీతిలో స్పందన లభిస్తోందని తెలిపారు. అనంతరం శలపాడు గ్రామ ప్రజలు ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు చెబుతూ, జగనన్న చిత్రపటాలను ప్రదర్శించారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు



వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

పెదనందిపాడు: విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ ఈఈ కె.వి.ఎల్.ఎస్. మూర్తి తెలిపారు. పెదనందిపాడు మండలంలో బుధవారం సిబ్బంది 2,658 సర్వీసుల్ని తనిఖీ చేశారు. విద్యుత్ చౌర్యానికి సంబంధించి రెండు కేసులు నమోదు చేసి రూ.1,50,000, అదనపు లోడ్ కింద 121 సర్వీసులకు రూ.7,04,000, మాల్ ప్రాక్టీస్ కింద ఒక కేసుకు రూ. 5,000 జరిమానా విధించినట్లు ఈఈ కె.వి.ఎల్.ఎస్. మూర్తి తెలిపారు. మొత్తం 8,89,000 అపరాధ రుసుం వసూలు చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో బాపట్ల విద్యుత్ ఈఈ జి. ఆంజనేయులు, డెప్యూటీ ఈఈలు పి.వి.ఆర్. మల్లికార్జునరావు, ఎం.శ్రీనివాసరావు, పెదనందిపాడు ఏఈ బి. వీరాంజనేయులు, బాపట్ల డివిజన్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

పొన్నూరు కెనాల్ రోడ్డులో సైడ్ డ్రెయిన్ నిర్మాణం

పొన్నూరు: పట్టణంలోని 26 వార్డు కెనాల్ రోడ్డులో ప్రజలకు ఇబ్బందికరంగా మారిన సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టేలా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.11.70 లక్షలతో ఇటీవల సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనుల ప్రారంభ దశలోనే నిర్మించిన కాలువ వర్షాలకు కుంగిపోయిందని చెప్పారు. త్వరితగతిన సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రెండు బైక్‌ల అపహరణ

చేబ్రోలు: మండలంలో బైక్ దొంగతనాలు పెరిగిపోతున్నాయి. ఒకే ప్రాంతంలో మంగళవారం రాత్రి రెండు బైక్‌లు అపహరణకు గురవ్వడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చేబ్రోలు నుంచి వడ్లమూడి వెళ్లే రహదారిలో వాటర్ ట్యాంక్ ప్రాంతంలో నివసిస్తున్న నాగిశెట్టి ఉదయకుమార్ రాత్రి ఇంటి ముందు బైక్‌ను పార్కింగ్ చేశారు. ఉదయం లేచి చూసేసరికి మాయమైంది. ఇదే ప్రాంతంలో ఎన్. సురేష్‌బాబుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు అపహరించుకు పోయారు. ఇద్దరు చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పాతరెడ్డిపాలెం ప్రాంతంలో కూడా మరో బైక్ మాయమైనట్లు తెలిసింది.

అడ్డూ అదుపులేని చోరీలు

కొద్ది రోజుల కిందట నారాకోడూరు పాత కెనరా బ్యాంక్ ప్రాంతంలో సాయంత్రం సమయంలో షాపు ముందు ఉంచిన కొత్త బైక్‌ను దొంగలు మాయం చేశారు. నాలుగు రోజుల కిందట సుద్దపల్లిలో ఇంటి ముందు ఉంచిన మైలా చింతయ్యకు చెందిన బైక్ చోరీకి గురైంది. గత నెల రోజుల్లో మండలంలోని గ్రామాల్లో 20 వరకు బైక్‌లు దొంగతనానికి గురైనట్లు సమాచారం. పోలీసుల కళ్లు గప్పి దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు కార్పొరేట్ వైద్యం

గుంటూరు రూరల్: 16వ డివిజన్ 194వ సచివాలయం పరిధిలోని బొంతపాడులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యులు సింధూర, జ్యోతి పలువురికి బీపీ, షుగర్, గుండె, కంటి, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధులతో పాటు కాళ్లు, కీళ్ల నొప్పులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అర్బన్ క్లస్టర్- 1 కన్వీనర్ ఏటుకూరి విజయసారథి మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా జగనన్న పేదలకు కార్పొరేట్ వైద్యసేవల్ని అందిస్తున్నారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. బుడంపాడు సొసైటీ చైర్మన్ ద్రాక్షారం మీరజ్‌కుమార్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో సమూల మార్పులు తెచ్చి, పేదలకు అండగా నిలిచిన నాయకుడు జగనన్న అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం నాయకుడు, అర్బన్ క్లస్టర్ జేసీఎస్ కన్వీనర్ దారం అశోక్‌కుమార్, నాయకులు మద్దాల సుధాకర్, వలేటి సారథి, టి. మస్తాన్‌రావు, ఎం. సంపత్‌కుమార్, జి.చిరంజీవి, వి. మురళి, వి. వీరాస్వామి, జి.వెంకటేశ్వర్లు, జి. సుధీర్, ఎస్. మురళి, ఆశా వర్కర్లు, వలంటీర్లు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి గురించి నరేంద్ర మాట్లాడటం విడ్డూరం

వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పొన్నూరు: పాతికేళ్ల టీడీపీ పాలనలో పొన్నూరు నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేయని ధూళిపాళ్ల నరేంద్ర నేడు దాని గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ హయాంలో 20 వార్డులోని అమెరికన్ హాస్పిటల్ వెనుక భాగాన నూతనంగా నిర్మించిన డ్రైనేజీ గోడ నాణ్యత లేక కూలిపోతే తమ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదా? అని ప్రశ్నించారు. ఈ విషయమై కౌన్సిల్లో నిలదీసినా పట్టించుకోలేదని త తెలిపారు. ప్రస్తుతం 26 వార్డులో చేపట్టిన సైడ్ డ్రైన్ నిర్మాణం వర్షం కారణంగా కూలిపోతే ఆ పనులకు బిల్లుల చెల్లింపు జరగలేదని చెప్పారు. వెంటనే నిర్మాణం పూర్తి చేసేలా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అధికారుల్ని ఆదేశించారని తెలిపారు. మాజీ కౌన్సిలర్ ఎం. అనిల మాట్లాడుతూ నరేంద్ర తన పాలనలో నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. తన వర్గం సంక్షేమం, సంగం డైరీ అభివృద్ధికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చారని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ మాట్లాడుతూ ప్రజల ఆదరణ కోల్పోయిన ధూళిపాళ్ల నరేంద్ర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉనికిని చాటుకునేందుకు అవాస్తవ ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. గిరిజన విభాగం నాయకులు యందేటి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గత నాలుగున్నర ఏళ్లలో ఎమ్మెల్యే రోశయ్య ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, పార్టీ మండల అధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు, జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్దేశిత గడువులోగా అభివృద్ధి పనుల్ని పూర్తి చేయండి

అధికారులకు నగర మేయర్ కావటి సూచన

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, జాప్యం జరగకుండా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు స్పష్టం చేశారు. పశ్చిమ నియోజకవర్గం 18వ డివిజన్‌లోని రామనామ క్షేత్రం నుంచి అచ్చయ్య దాబా సెంటర్ వరకు రూ.80 లక్షలతో నగరపాలక సంస్థ నిర్మిస్తున్న సీసీ డ్రెయిన్లు, రోడ్డు నిర్మాణ పనుల్ని బుధవారం మేయర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిర్దేశిత గడువులోపు నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు తూర్పు,పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల పరిధిలో రూ. 450 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనుల్ని కుల, మత, పార్టీలకతీతంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పనులు జరిగేప్రాంతాల్లో ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడకుండా ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యటనలో కార్పొరేటర్లు నిమ్మల వెంకటరమణ, డీఈఈ రమేష్ బాబు, ఏఈ రాంబాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దారుఢ్యం

జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. వెంకటేశ్వరరావు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో

గుంటూరు ఎడ్యుకేషన్: అగ్ర భారత్ నిర్మాణంలో పాలు పంచుకునే విద్యార్థినీ, విద్యార్థులు శారీరక, మానసిక దృఢంగా ఉండాలని, అందుకు విద్యార్థి దశలో క్రీడలు ప్రధాన పాత్ర పోషిస్తాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బీఆర్ స్టేడియంలో బుధవారం కన్నా విద్యాసంస్థల క్రీడోత్సవాన్ని నిర్వహించారు. క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎస్‌డీవో జ్యోతి ప్రజ్వలన చేసి, క్రీడా పతాకాన్ని ఊపి క్రీడల్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నాయని చెప్పారు. ఇటీవల కౌలాలంపూర్ లో జరిగిన ఆసియా క్రీడల పోటీల్లో భారతదేశ క్రీడాకారులు గణనీయ స్థాయిలో పతకాలు సాధించారని తెలిపారు. వచ్చే ప్రతిష్ఠాత్మక ప్రపంచ ఒలింపిక్స్ భారతదేశంలో ఘనంగా నిర్వహించేందుకు భారత ప్రధాని తమ సంసిద్ధతను వ్యక్తం చేశారని తెలియజేశారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ తమ పాఠశాలలో నాలుగు దశాబ్దాలుగా ఉన్నతమైన విద్యాబోధనతో పాటు క్రీడలు, సాంస్కృతిక అంశాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. 50, 100, 150, 200 మీటర్ల పరుగు పందెలతో పాటు షటిల్, బాస్కెట్ బాల్, వాలీబాల్, హై జంప్, లాంగ్ జంప్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా, క్రీడా స్ఫూర్తితో పాల్గొంటున్నట్లు ఆయన వివరించారు.

రేపు సినిమా, టీవీ నటులకు పురస్కారాలు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళా వేదికపై శుక్రవారం సినిమా, టీవీ నటులకు పురస్కారాలు అందజేయనున్నట్లు కళా విపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, డాక్టర్ మహ్మద్ రఫీ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సినిమా, టీవీ నటులు రాగిణి, గీతాసింగ్, డాక్టర్ సి.ఎస్. ప్రసాద్, కె.ఎస్.కుమార్, మేకా రామకృష్ణ, కళ్యాణ మాధవి, స్వప్నలకు పురస్కారాలు అందించనున్నట్లు వారు పేర్కొన్నారు. హాస్య వల్లరి, మిమిక్రీలతో పాటు కవితా పఠనం ఉంటుందని, కళాభిమానులు పాల్గొనాలని వారు కోరారు .

తూర్పులో శరవేగంగా అభివృద్ధి పనులు

నగరంపాలెం: తూర్పు నియోజకవర్గ పరిధిలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరి ఫాతిమా తెలిపారు. ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా ఆదేశాలు మేరకు బుధవారం 51వ డివిజన్ పరిధిలో శ్రీనగర్, మాలకొండయ్య కాలనీలో పూర్తయిన తాగునీటి పైపులైన్, సిమెంట్ రహదారుల్ని ఆమె పరిశీలించారు. స్థానిక ప్రజలతోనూ మాట్లాడారు. ఏవైనా సమస్యలు ఉన్నాయా ? అని అడిగి తెలుసుకున్నారు. సత్వరమే వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. వల్లూరివారితోట, మహబూబ్‌నగర్‌లో యూజీడీ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆమె వెంట 51 డివిజన్ ఇన్‌చార్జ్ చెన్నుపాటి వెంకటరమణ శ్రీనివాస్, 15 డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్ యాదవ్, నాయకులు హైదర్, హుస్సేన్, భాస్కర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌లోకి ఇద్దరు పోలీసు అధికారులు

నగరంపాలెం: జిల్లాలోని ఇద్దరు పోలీస్ అధికారుల్ని ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని డీసీఆర్బీ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణ కొద్దిరోజుల కిందట వీఆర్‌కు వెళ్లారు. తర్వాత సీసీఎస్‌లో ఉన్న సీఐ బి.శ్రీనివాస్‌ను వారం రోజుల కిందట రేంజ్ వీఆర్‌కు పంపించారు. ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న నిహార్ బాషాను నియమించారు. ఆయన బుధవారం బాధ్యతలు చేపట్టారు.

ఇజ్రాయిల్ మారణకాండ దారుణం

లక్ష్మీపురం: గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ దారుణమని అవగాహన సంస్థ సభ్యులు, విద్యావేత్త, విశ్లేషకులు ఆర్.వి.సింగరయ్య ఖండించారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే కాల్పుల విరమణ, స్వతంత్ర పాలస్తీనా వంటి నినాదాలు అమెరికా బ్రిటన్, జర్మనీ వంటి పశ్చిమ దేశాల సహ ప్రపంచవ్యాప్తంగా హోరెత్తుతున్నాయని తెలిపారు. ఆ సంఘీభావ ఉద్యమంలో భారతీయులమంతా భాగస్వాములు అవుదామని ఆయన పిలుపునిచ్చారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ నాయకులు ఆర్.వెంకటరత్నం, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్.జి రంగాకు ఘన నివాళి

సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్.జి రంగా కడిగిన ముత్యంలా నిలిచారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి కొనియాడారు. కార్యాలయంలో బుధవారం ఎన్.జి. రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ ముప్పాళ్ల వి.యస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ కార్యకర్తలను దూషిస్తే సహించం'

గుంటూరు మెడికల్: బీజేపీ నాయకులు, కార్యకర్తలను దూషిస్తే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ అన్నారు. గుంటూరు చంద్రమౌళీనగర్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీపావళికంటే ముందే రాష్ట్ర రాజకీయాల్లో వేడి వాతావరణం నెలకొందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సంస్కారం లేకుండా మాట్లాడాన్ని తీవ్రంగా ఖండించారు. సమావేశంలో మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు నాగమల్లేశ్వరి, కోలా రేణుకాదేవి, నరసింహారావు పాల్గొన్నారు.